క్లుప్తంగా

తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం నుంచి దాదాపు 200 మంది భక్తులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ప్రతి ఏటా వేసవిలో మిడుతూరు నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి భక్తులు పాదయాత్రగా బయలుదేరి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఈ ఏడాది దాదాపు 200 మంది భక్తులు శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గురువారం సాయంత్రం పాదయాత్ర ప్రారంభించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి దేవస్థానం ఈఓ లవన్న, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

జీవాలకు గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ భాస్కర్

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో పశు వైద్యాధికారి భాస్కర్ పశువులకు గాలి కుంటు నివారణకు గురువారం టీకాలు వేశారు. 20 ఎద్దులు, 60 గేదెలు, 40 దూడలకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. వేసవి కాలం ఆరంభమైందని, పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. 4 నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ మనీష్, ప్రసన్న, గోపాల మిత్ర భాస్కర్, ప్రవీణ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న నాబార్డు బ్రాంచ్ మేనేజర్ సుధాకర్

ఆత్మకూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆత్మకూరు యూనియన్ బ్రాంచ్ మేనేజర్ సుధాకర్, లైఫ్స్ సంస్థ అధ్యక్షుడు కలిముల్లా అన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లైఫ్ సంస్థ కార్యదర్శి సునిల్‌రాజు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల శ్రమదానం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నర్సయ్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త కృష్ణ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కళాశాలకు రోడ్డు కిరువైపులా ఉన్న ముళ్ల కంప, చెట్లను శ్రమదానం చేసి తొలగించినట్లు తెలిపారు.

ఆత్మకూరు ఏపీపీగా ఆసిఫ్ అలీ ఖాన్



వెలుగోడు: ఆత్మకూరు సెషన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) గా వెలుగోడుకు చెందిన అడ్వకేట్ ఖురాసాని ఆసిఫ్ అలీ ఖాన్ నియామితులయ్యారు. ఈ మేరకు ఫిబ్రవరి 28న ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని. ఉత్తర్వులు జారీ అయినప్పటి నాటి నుంచి మూడు సంవత్సరాలు పదవీలో కొనసాగుతానని ఆసిఫ్ అలీఖాన్ చెప్పారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

పాలన చేరువైంది.. పల్లె మారింది

- గ్రామ సచివాలయాల ఏర్పాటుతో సేవలు అందుబాటులో
- స్థానికంగా సమస్యలకు పరిష్కారం
- గ్రామీణులకు తప్పిన అగచాట్లు
- నూతన కార్యాలయాల నిర్మాణాలతో కొత్తరూపు సంతరించుకున్న పల్లెసీమలు



నల్లకాల్వ గ్రామంలో నూతనంగా ఏర్పడిన గ్రామసచివాలయం

ఆత్మకూరు: టీడీపీ పాలనలో ఓ పథకం మంజూరు కావాలంటే ఆ మండల కార్యాలయానికి వెళ్లి అధికారులు, టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయాలను,అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పాలన అందిస్తున్నారు. అంతే కాకుండా కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నూతన కార్యాలయాల భవనాలను నిర్మించడంతో పల్లెలు కొత్తశోభను సంతరించుకున్నాయి.

నూతన భవనాల మంజూరు

శ్రీశైలం నియోజకవర్గంలో ప్రజల కోసం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పాలసేకరణ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి నూతన భవనాలు మంజూరు చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం, మెరుగైన సేవలందించేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నూతన కార్యాలయాల భవనాలను నిర్మిస్తున్నారు. పలు చోట్ల నిర్మాణాలు పూర్తి కాగా వాటిలోనే పాలన కొనసాగుతోంది. గ్రామసర్పంచ్ మొదలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, రెవెన్యూ, మండల ప్రజా పరిషత్ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వ్యవసాయ శాఖ ఇలా పలు కార్యాలయాల ఉద్యోగులు ఇలా గ్రామాల్లో వెలసిన నూతన కార్యాలయాల్లో హుందాగా తమ ఉద్యోగం చేసుకుంటూ ప్రజలకు ఎన్నో సేవలు అందజేస్తూ ప్రశంసలు అందుకున్నారు.

రూ. కోట్లు మంజూరు..

ప్రభుత్వం భవన నిర్మాణం కోసం కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. సచివాలయానికి రూ.40 లక్షలు, సబ్‌సెంటర్ల కు రూ.17.5 లక్షలు, రైతు భరోసా కేంద్రాల రూ.23 లక్షలు, పాల కేంద్రాలకు రూ.14 లక్షలు చొప్పున ఒక్కో సచివాలయపరిధిలో రూ.94.5లక్షలు మంజూరు చేసి నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలో 62 నూతన భవనాలు మంజూరు కాగా 41 నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతావి నిర్మాణాలు కొనుసాగుతున్నాయి. ఆత్మకూరు మండంలో 16 భవనాలు మంజూరు కాగా 10 పూర్తయ్యాయి. వెలుగోడులో 10కి గాను 8, మహానందిలో 13లో 8, బండిఆత్మకూరులో 20 భవనాలకు గాను 13, శ్రీశైలంలో 3 మంజూరు కాగా రెండు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా భవనాల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

ప్రజల చేంతకే సేవలు



నూతన సచివాలయ కేంద్రాల ఏర్పాటుతో పల్లెల్లో ప్రజా పాలన కొనసాగడం ప్రారంభమైంది. సచివాలయాలు, వాటి అనుబంధ కార్యాలయాల్లో వలంటీర్లు సహకారంతో ప్రతి పల్లెలో రేషన్‌కార్డు మొదలు, రైతన్నలకు, వృద్ధులకు, రోగులకు అవసరమైన సేవలు గ్రామాల్లోనే అందుతున్నాయి. ఫలితంగా ఆ గ్రామ ప్రజలు సుదూరంగా ఉన్న డివిజన్, మండల కేంద్రాలకు వెళ్లకుండానే వారివారి ప్రజాసంక్షేమ పథకాలు పొందుతున్నారు. అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాన్ని మంజూరు చేస్తున్నాం.

– మోహన్‌కుమార్, ఎంపీడీఓ, ఆత్మకూరు

సచివాయాల్లోనే సమస్యలు పరిష్కరించుకుంటున్నాం



ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమస్యలు ఉంటే నేరుగా సచివాలయాల వద్దకు వెళ్లి సమస్యలు తెలుపుతున్నాం. వారు ఆ సమస్య సంబంధించి ఫలానా అధికారికి సంబంధించి దరఖాస్తు లు ఇలా చేయాలని చెప్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం నూతన భవనాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయం.

–లింగమయ్య ఆత్మకూరు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయం ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందిస్తున్న గొప్ప నాయకుడు. పట్టణంలో ప్రభుత్వం ద్వారా అర్హత ఉన్న లబ్ధిదారులు సచివాలయానికి వెళ్లి మాకు ఇంటి స్థలాలు ఎప్పుడు మంజూరు చేస్తారా, పింఛన్ ఎప్పుడు వస్తుంది లాంటి పలు విషయాలు తెలుసుకుంటున్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– మొమిన్ ఇబ్రహీం, ఆత్మకూరు

పీఓఎల్ఆర్ పనులు 85 శాతం పూర్తి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు భూ సమస్యలు లేకుండా చేసేందుకు చేపట్టిన పీఓఎల్ఆర్ (భూ రీసర్వే) పనులు మండలంలో 85 శాతం పూర్తి అయ్యాయని పీఓఎల్ఆర్ డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాయాల పరిధిలోని వీలేజ్ సర్వేయర్లు రైతుల భూములకు సంబంధించిన వివరాలను, ప్రభుత్వ భూముల, మిగులు భూముల వివరాలను సేకరిస్తున్నారని వివరించారు. అదేవిధంగా భూమిపై సాగులో ఒకరు, ఆన్‌లైన్‌లో మరోకరు ఉన్న వాటిని గుర్తిస్తున్నామని చెప్పారు. త్వరలో ఈ పనులు పూర్తిచేసి జగనన్న భూరక్ష పథకం ద్వారా అనుమతి పత్రాలు ఇస్తామని వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు మూడు పోలింగ్ కేంద్రాలు

వెలుగోడు: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టణంలోని రెండు ప్రాంతాల్లో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఎస్ఐ జగన్ మోహన్‌తో కలిసి సందర్శించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్స్‌కు రెండు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు ఉర్దూ స్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వారి వెంట సర్వేయర్ ఉపేంద్ర, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

లింగాలగట్టు వద్ద కార్చిచ్చు

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టు గ్రామంలో ఏర్పడిన కార్చిచ్చు వలన కొండ తగులబడుతోంది. కొండకు ఆనుకుని ఉన్న బోయ క్యాంప్ సమీపంలో మంటలు ఎగసి పడుతున్నాయి. కొండ నుంచి గ్రామ సమీపానికి మంటలు వ్యాపిస్తాయేమోనని స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

మహానంది: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రూపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా గురువారం తిమ్మాపురంలోని కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో అడుగేస్తూ అన్నింట్లో విజయం సాధించాలన్నారు. పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులు భయాందోళనలకు గురవకుండా రాయాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ భవానీ, ఎంపీహెచ్ఈఓ విజయారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ స్రవంతి, హెల్త్‌అసిస్టెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ తరుపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోటీలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డిని ప్రభుత్వ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ఎంపీపీ మురళీ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పబ్బుటి రవికుమార్, ఓంకారం రెడ్డి, దానమయ్య, వెంకటేష్, నాగార్జున, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు

పాములపాడు: రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)ల ద్వారా జొన్న, మొక్కజొన్న, శనగ పంట దిగుబడిని కొనుగోలు చేయబడునని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. గురువారం మండలంలోని వాడాల, మద్దూరు గ్రామాల్లోని ఆర్బీకేలను తనిఖీ చేశారు. అలాగే రైతులతో సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలు గురించి వివరించారు. రైతులు పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఏఓ ఫణీశ్వరరెడ్డి, వీహెచ్ఏ ప్రియాంక, ఎంపీఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవానిరతి

వెలుగోడు: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి వైఎస్సార్ పెన్షన్ కానుక అసరాగా నిలుస్తోంది. వివిధ రోగాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు వలంటీర్లు వ్యయప్రయాసలకోర్చి అక్కడి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తూ సేవానిరతిని చాటుకుంటూ ప్రశంసలు పొందుతున్నారు. పట్టణంలోని గట్టు తండాకు చెందిన సీతమ్మ బాయి నంద్యాలలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ శకుంతల బాయి నంద్యాల వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. అలాగే నంద్యాల లోని శాంతిరాం హాస్పిటల్‌లో కోమా ఉండి చికిత్స పొందుతున్న బూసిరాజు నాగన్న అనే పెన్షన్ దారుడికి వెలుగోడు–1 సచివాలయానికి చెందిన వలంటీర్ బండి ప్రియాంక పింఛన్ అందించారు. అదేవిధంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో తన కుమారుడి చికిత్సకోసం అక్కడే ఉన్న సరోజ బాయికి వలంటీర్ స్వామి నాయక్ పింఛన్ అందించాడు.

హాస్పిటల్‌కు వెళ్లి ...

మిడుతూరు: మండలపరిధిలోని అలగనూరు గ్రామానికి చెందిన తప్పెట స్వామక్క కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని గ్రామ వలంటీర్ వేణమ్మ అక్కడివెళ్లి పింఛన్ అందజేసింది. అదేవిధంగా వీపనగండ్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు గడ్డల శంకర్ ప్రసాద్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ నవీన ఆసుపత్రికి వెళ్లి నగదు అందించారు.

తమ్మడపల్లె నుంచి తిరుపతికి వెళ్లి..

మహానంది: మహానంది మండలం తమ్మడపల్లె గ్రామానికి చెందిన నల్లారెడ్డి కృష్ణవేణమ్మ తిరుపతిలోని బర్డ్స్ ఆస్పత్రిలో కీళ్లమార్పిడి సమస్యతో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ ముకుందారెడ్డి తిరుపతిలోని బర్డ్స్ ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారురాలికి పింఛను సొమ్మును అందించాడు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ యశస్విని వలంటీర్‌ను ప్రశంసించారు.



తిరుపతి ఆసుపత్రిలో కృష్ణవేణమ్మకు పింఛను నగదు అందిస్తున్న వలంటీర్ ముకుందారెడ్డి



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో దివ్యాంగుడు గడ్డల శంకర్ ప్రసాద్‌కు పింఛన్ అందజేస్తున్న వీపనగండ్ల వలంటీర్ నవీన

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

పాములపాడు: మండలంలో గురువారం రెండో రోజు ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సహా వలంటీర్లు పింఛన్ల పంపిణీ కొనసాగించారు. గత ప్రభుత్వంలో హయాంలో, ప్రస్తుత ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో తేడాను, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ పునరుద్ధరణ పూజలు



పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్త రాఘవరెడ్డి, గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామంలో గురువారం భక్తిశ్రద్ధలతో శివాలయ పునరుద్ధరణ నిర్మాణ పనులను ఎండోమెంట్ ఈఓ వెంకటరమణ ఆధ్వర్యంలో అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలను పఠిస్తూ ఆలయంలోని వినాయక, నందీశ్వర, శివలింగాలకు పంచామృత అభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చనలతో పాటు బాలాలయం కార్యక్రమం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ గ్రామానికి చెందిన రాఘవరెడ్డి దేవదాయ శాఖకు ఆలయ నిర్మాణ నిమిత్తం రూ. 10.20 లక్షలు నిధులను కేటాయించినట్లు తెలిపారు. అందుకు ప్రతిగా సీజీఎం నిధుల నుంచి నూతన ఆలయ నిర్మాణం నిమిత్తం రూ. 66 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

‘మధ్యాహ్నం’లో నాణ్యతపై రాజీ పడొద్దు

శిరివెళ్ల: మధ్యాహ్న భోజనంలో నాణ్యతపై రాజీ పడొద్దని డీఈఓ అనురాధ తెలిపారు. గురువారం చెన్నూరు ప్రాథమికోన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9.50 గంటలకే పాఠశాలకు చేరుకొని మధ్యాహ్న భోజనం వరకు తనిఖీలు చేశారు. మెనూ ప్రకారం వంట చేశారు. అయితే పులిహోర నాణ్యత తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతను మెరుగు పర్చాలని నిర్వాహకులకు సూచించారు. వంట ఆరుబయట చేస్తుండంతో డీఈఓ అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులపై శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వంట గది మరమ్మతు చేస్తున్నారని, దీంతో బయట వంట చేస్తున్నారని హెచ్ఎం షణ్ముఖరెడ్డి తెలిపారు.

సబ్‌జూనియర్ బాలికల హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



బాలికలకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): 11వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల హాకీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి సునీల్ తెలిపారు. గురువారం స్థానిక ఎస్పీజీ హైస్కూల్ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన బాలికలను ఎంపిక చేశామని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు.. శ్రీలత, మమత, శ్రీజ, ఫాతిమా, పావని, లహరి, భార్గవి, ప్రియదర్శిని, మేఘన, స్వాతి, సరోజ, శ్రీలక్ష్మి, భార్గవి, అనిత, రేవతి, జ్ఞానప్రసన్న, జగృత, హంసిక ఎంపికయ్యారని వివరించారు. జిల్లా హాకీ కోచ్ శివ, మేనేజర్ శ్రావణ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు..

నంద్యాల(సిటీ): అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు అయ్యలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్న వీ.దాస్ ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత నెల 16 నుంచి 18వ తేదీల్లో కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో దాస్ 6వ స్థానంలో నిలిచి అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై పాఠశాల పేరు ప్రతిష్టలను నిలిపారని కొనియాడారు. త్వరలో ఫిలిప్పీన్స్ దేశంలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో దాసు పాల్గొంటాడని చెప్పారు. ఉపాధ్యాయులు దాస్‌ను అభినందించారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

ఆత్మకూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద, గురువారం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు నెలల వ్యవధిలో 2 సార్లు గ్యాస్ ధర పెంచడం ఏంటని ప్రశ్నించారు. అంతేకాకుండా సిలిండర్‌కు ఇచ్చే సబ్సిడీని కూడా 2 సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వం నిలిపివేసి పేద, మధ్యతరగతి వారిపై ఎనలేని భారం మోపిందన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, సురేంద్ర, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై భారం

పాములపాడు: కేంద్ర ప్రభుత్వం ఎనిమిదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అమాంతం పెంచి సామాన్యుల పై పెను భారం మోపిందని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.500 ఉన్న గ్యాస్ రూ.1200 పెంచిందని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకుడు వెంకటేశ్వరరావు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా

మిడుతూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గడివేముల మండలం బూజనూరు గ్రామానికి చెందిన శంకర్ జొన్నసరుగు లోడ్ తీసుకెళ్తుండగా విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ట్రాక్టర్ (ఏపీ 21 టీఏ 5132) అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ప్రమాదం తప్పింది.

గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలి

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఆయా గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడి, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని తెలియజేసి నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఈ పంచాయతీ రాజ్ రాఘవేంద్రప్రసాద్, ఎంఈఓ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

మిడుతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 3 నుంచి 7వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నిర్వహించనున్న ప్రాక్టికల్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్స్ ఉదయం, మధ్యాహ్నం మూడు బ్యాచ్‌ల చొప్పున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 56 మంది, ఏపీ ఆదర్శ పాఠశాల నుంచి 40 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోండి

బొమ్మలసత్రం: వేడిగాలులు మొదలయ్యాయని, అధిక వేడి గాలులకు వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎం అండ్‌హెచ్ఓ వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణంలో మార్పు కారణంగా వేడి గాలులు అధికంగా వీచే అవకాశాలున్నాయనే నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోవటం, చెమట పట్టకపోవటం, శరీర ఉష్ణోగ్రత పెరగటం, పెదవులు ఎండిపోయి నోరు పిడసగట్టుక పోవటం, కలవరింతలు, ఫిట్స్ రావటం, అపస్మారక స్థితికి వెళ్లటం లాంటివి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని చెప్పారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



రెడ్‌క్రాస్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి పురస్కరించుకొని శైవ క్షేత్రాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలందించిన రెడ్‌క్రాస్ సభ్యుల సేవలు అభినందనీయమని డీఆర్‌ఓ పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో 85మంది సభ్యులకు, 29 ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు డీఆర్‌ఓ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి, సెక్రటరీ మమతారెడ్డి మాట్లాడుతూ ఆరు రోజుల పాటు శ్రీశైలం, పెచ్చెరువు, కైలాసద్వారం, మహానంది, యాగంటి, ఓంకారం, భోగేశ్వరం, తదితర శైవ క్షేత్రాల్లో వైద్యసేవలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని చెప్పారు. రెడ్‌క్రాస్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మునీర్, సద్దాం, బాబు, ఉపాధ్యక్షుడు మారుతి, కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు తప్పనిసరి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో పరిశుద్ధ్య పనులు తప్పనిసరిగా చేయించాలని ఎంపీడీఓ మేరి ఆదేశించారు. గురువారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలలో 1–15వ తేదీ వరకు గ్రామాలలో శానిటేషన్ ప్రక్రియ చేపట్టి ప్రతి రోజూ రిపోర్టును మండల స్థాయి అధికారులకు పంపాలన్నారు. అదేవిధంగా గ్రామాలలో నీటిసమస్యపై ప్రతి రోజు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారమివ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కల్పిస్తాం

నందికొట్కూరు: నాటుసారా తయారు చేయకుండా మహిళలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని నీలిషికారి పేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీకి దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐ ఎన్వీ రమణ, కౌన్సిలర్ సుమలత, మెప్మా సీఎంఎం ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, గోల తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరులో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నందికొట్కూరులో పండ్ల వ్యాపారులకు పంపిణీ చేసిన తోపుడు బండ్లు



అభిమాన ‘సేవ’కులు

సాక్షి నెట్‌వర్క్: ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు.